నేడు డయల్ యువర్ డీఎం

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్–2 ఆర్టీసీ డిపో నుంచి నడిచే బస్సు సర్వీసులకు సంబంధించి ప్రయాణికుల నుంచి సలహాలు, ఫిర్యాదులు స్వీకరించేందుకు గురువారం సాయంత్రం 4 నుంచి 5 గంటల నడుమ డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. ఉద్గిర్, బీచ్‌కుండ్, జూకల్, కొల్లాపూర్, విజయవాడ, బైలడిల్లా, జగదల్‌పూర్, బెంగళూరు, తొర్రూర్ వెళ్లే బస్సులు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రయాణికులు నేరుగా డీఎంతో మాట్లాడ వచ్చన్నారు. ఈ మార్గాల్లోని బస్సులకు సంబంధించి సమస్యలు ఉంటే 9959226249 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ బ్రోచర్ విడుదల

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ధ్వజస్తంభం కార్యక్రమాలకు సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ ఎరుకల విశ్వనాథ్‌గౌడ్ మాట్లాడుతూ.. కర్మన్‌ఘాట్ చౌరస్తాలో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన పోచమ్మ ఆలయం జీర్ణావస్థలోకి చేరటంతో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ దివంగత ఎరుకల కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో రూ.కోటితో అదే స్థలంలో పండితుల పర్యవేక్షణలో నూతన ఆలయం నిర్మించడం జరిగిందన్నారు. ఆగస్టు 6 నుంచి 10 వరకు నూతన ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు వేదపండితుల మంత్రోచ్చారణలతో అమ్మవారి మూలవిరాట్ విగ్రహ, ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు ఏర్పాటు నిర్వహిస్తామన్నారు. నాలుగు రోజుల పాటు జరిగే కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పిలుపునిచ్చారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు తప్పవు



నాగోలు: సర్వీస్ రోడ్డులో ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను జీహెచ్‌ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్ అధికారులు, ఎల్‌బీనగర్ ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. దిల్‌సుఖ్‌నగర్ రాజధాని థియేటర్ నుంచి ఎల్‌బీనగర్ మెట్రో వరకు అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. చైతన్యపురి, కొత్తపేట, ఆర్‌కేపురం, ఎన్టీఆర్‌నగర్, గ్రీన్‌హిల్స్‌కాలనీ, రంగారెడ్డి కోర్టు ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌లపై నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: అభివృద్ధి పనులలో నాణ్యత పాటిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా సకాలంలో పూర్తి చేయాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఎస్‌కేడీనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కాలనీలో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట ఏఈ నరేందర్, నాయకులు సుధాకర్‌రెడ్డి, రఘురాంనేత, అమరేందర్‌రెడ్డి, వెంకటరమణ, కృష్ణరావు, అశ్విన్, సురేష్‌కుమార్, సాయి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సన్మానం



మలక్‌పేట: హైదరాబాద్ గంగోత్రి లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు వల్లెం స్వప్న ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ లయన్ డా. అశోక్, ఉపాధ్యాయురాలు ఈనాలను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వల్లెం స్వప్న మాట్లాడుతూ.. ప్రొఫెసర్ అశోక్ పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించి తగిన ప్రోత్సాహం సహకారం అందిస్తారన్నారు. గురుపౌర్ణమి పురస్కరించుకుని వారిని సన్మానించామన్నారు. కార్యక్రమంలో మహేంద్రకుమార్‌రెడ్డి, సత్యనారాయణరావు, యాదయ్యగౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

పెట్టుబడి ముసుగులో మోసం

ఇద్దరి రిమాండ్

నాగోలు: పెట్టుబడి ముసుగులో డబ్బులు కాజేసిన ఇద్దరిని రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ కాశీవిశ్వనాథ్ వివరాల ప్రకారం..నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట, రాఘవేంద్ర కాలనీ చెందిన మాధవరం వంశీ కృష్ణారావు నగరానికి వచ్చి సిద్ధార్థనగర్‌లో ఉంటున్నాడు. కరీంనగర్, గోదావరిఖని చెందిన తాటిపెల్లి రాకేష్ నగరంలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇద్దరు కలిసి వాట్సాప్ నంబర్ ద్వారా సంప్రదించి ఆర్థిక సలహాలు అందించే గ్రూప్‌గా నటిస్తూ టెలిగ్రామ్ గ్రూప్ ఆర్–7322 టీమ్ హార్వేకి జోడించారు. తాము అందించే సలహాల కోసం డబ్బులు ఇస్తే రెట్టింతలు ఇస్తామని నమ్మించారు. ఈ క్రమంలో నిందితులు అనేక బ్యాంకు ఖాతాలను తెరిచి బాధితుల నుంచి డబ్బులు తమ ఖాతాల్లోకి వేసుకున్నారు. తాము ఇచ్చిన డబ్బులు తిరిగి రాకపోవడంతో వారిని సంప్రదించేందుకు యత్నించగా స్పందన లేదు. మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితులు దేశ వ్యాప్తంగా ప్రజలను మోసం చేసి చేసి వివిధ వివాదాస్పద బ్యాంక్ ఖాతాల్లోకి రూ.6,05,93,947 వేసుకున్నారు. అనంతరం నిందితులు రూ.5 కోట్లు ఇతర బ్యాంక్ అకౌంట్‌లలోకి బదిలీ చేశారు. వారి బ్యాంక్‌లో ఉన్న రూ. 22,64,164 సీజ్ చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు.

ఇక రాకపోకలు రయ్‌రయ్



రోడ్డుపై ఉన్న గుంతలు పూడుస్తున్న దృశ్యం

నాగోలు: నాగోలు చౌరస్తా నుంచి బండ్లగూడ ఆనంద్‌నగర్ చౌరస్తా నుంచి ఓఆర్‌ఆర్‌కు వెళ్లే రహదారి అంతా గోతులమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ సమస్యపై బుధవారం 'రోడ్డు ఇలా.. అడుగు వేసేదెలా' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించారు. నాగోలు చౌరస్తా నుంచి బండ్లగూడ– ఆనంద్‌నగర్ వరకున్న గుంతలకు మరమ్మతులు చేపట్టారు. వర్షం పూర్తిగా తగ్గిన తర్వాత రోడ్డు నిర్మాణం పూర్తిచేస్తామని అధికారులు వెల్లడించారు.

నడ్డి విరుగుతోంది!





- అభివృద్ధి పేరుతో రోడ్ల తవ్వకాలు
- పనుల అనంతరం పూడ్చని వైనం
- రాకపోకలకు ఇబ్బందులు
- దృష్టి సారించని అధికారులు

అభివృద్ధి పనుల పేరిట అంతర్గత రోడ్లు తవ్వి వదిలేస్తుండటంతో వాహనదారులు రాకపోకలకు నానా ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు, డ్రైనేజీ ఇతర పైపులైన్ల కోసం బీటీ, సీసీ రోడ్లను తవ్వుతున్న అధికారులు పనుల అనంతరం వాటికి మరమ్మతులు చేయకుండా వదిలేస్తుండటంతో రోడ్లన్నీ గుంతలమయంగా మారుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్లను తవ్వగా వచ్చిన మట్టి, వ్యర్థాలు అలాగే రోడ్లపై వదిలేస్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్లకు మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులతో మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తవ్విన రోడ్లను పూర్తి స్థాయిలో పూడ్చకుండా వదిలేయడంతో బాటసారులు సైతం నడవలేని దుస్థితి నెలకొంది. అక్బర్‌బాగ్, మూసారంబాగ్ డివిజన్ పరిధిలోని మలక్‌పేట పల్టాన్, ఆనంద్‌నగర్, దయానంద్‌నగర్, శాలివాహన నగర్, గడ్డిఅన్నారం తదితర ప్రాంతాలలోని ఏ రోడ్డు చేసినా ఛిద్రమై ఉన్నాయి. ఈ ప్రాంతాలలో విద్యా, వ్యాపార, వాణిజ్య సంస్థలు ఉండటం నిరంతరం రద్దీగా ఉంటుంది. ఉన్నతాధికారులు స్పందించి ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేయాలని వాహనదారులు, బాటసారులు కోరుతున్నారు. –మలక్‌పేట



అక్బర్‌బాగ్‌లో..



దయానంద్ నగర్ కమ్యూనిటీహాల్ వద్ద ఇలా..

స్మితా సబర్వాల్ వ్యాఖ్యలపై నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

మన్సూరాబాద్: దివ్యాంగులకు రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వాలని అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారిని స్మితా సబర్వాల్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించాలని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఎస్సీసెల్ మాజీ చైర్మన్ జోగు రాములు డిమాండ్ చేశారు.స్మితా సబర్వాల్ వ్యాఖ్యలను నిరసిస్తూ ఎల్‌బీనగర్‌లోని డా.బీఆర్. అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు స్మితా సబర్వాల్ బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కోటగిరి ఉషారాణి, నాయకులు నర్సింహ, అనిల్, విష్ణు, లక్ష్మయ్య, విజయ్‌కుమార్, కృష్ణ, మాధవి, సునీల్, శ్రీనివాస్, మోహన్ పాల్గొన్నారు.

వచ్చేనెల 18న పద్మశాలి సంఘం ఎన్నికలు



నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న ఎన్నికల అధికారులు

మన్సూరాబాద్: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల అధికారులు రావిరాల నరసయ్య, మాచర్ల రంగయ్య, ఉదయ్‌కుమార్ ఎల్‌బీనగర్ ఎల్‌పీటీ మార్కెట్‌లోని సంఘం ప్రధాన కార్యాలయంలో బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 29 నుంచి 31వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని ఆగస్టు1న స్క్రూట్నీ నిర్వహించి గుర్తులు కేటాయిస్తామన్నారు. 18న రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ నిర్వహించి సాయంత్రం 5 గంటల నుంచి ఓట్లను లెక్కించి విజేతలను ప్రకటిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నమోదైన 48,381 పద్మశాలి ఓటర్లతో ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎన్నికల కోర్ కమిటీ నేతలు బాల్‌రాజ్, రాజ్‌కుమార్, లింగయ్య, యాదగిరి, శ్రీనివాస్, సుధాకర్‌రావు, రమేష్, ధనంజయ్య, శంకర్, పరందాములు, మల్లేషం, లక్ష్మినర్సయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

లింగోజిగూడ: రోడ్డు ప్రమాదాల నివారణలో ఆర్టీసీ డ్రైవర్ల పాత్ర కీలకమని వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. హయత్‌నగర్ డిపో 1,2 లో బుధవారం నిర్వహించిన ప్రమాద రహిత వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో వెంకటేశ్వర్లు పాల్గొని ప్రసంగించారు. ఆర్టీసీ డ్రైవర్లు క్రమశిక్షణతో బస్సులు నడుపుతారన్నారు .డ్రైవింగ్‌లో ఫోన్ మాట్లాడం, మద్యం తాగి వాహనాలు నడపడం తోనే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. బస్సులను రోడ్డు మధ్యలో నిలుపరాదన్నారు. అనంతరం విధి నిర్వహణలో ఎలాంటి ప్రమాదాలు చేయని డ్రైవర్లను సన్మానించారు.కార్యక్రమంలో డిపో మేనేజర్లు విజయ్, శ్రీనివాస్, సహాయ మేనేజర్లు విజయ్‌కుమార్, రమాదేవి పాల్గొన్నారు.


సకాలంలో పనులు పూర్తి చేయాలి



ఆలయం వద్ద మరమ్మతు పనులను పరిశీలిస్తున్న అరుణరవీందర్‌రెడ్డి

సైదాబాద్: ఆషాఢ మాసంలో వేడుకగా నిర్వహించుకునే బోనాల ఉత్సవాల కోసం ఆలయాల వద్ద జరుగుతున్న పనులను సకాలంలో పూర్తి చేయాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం ఆమె జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి సైదాబాద్ డివిజన్ పరిధిలోని జయానగర్, గాంధీనగర్, హరిజన బస్తీలలోని అమ్మవారి ఆలయాల వద్ద చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించి మాట్లాడారు. శనివారం లోపు ఆలయాల వద్ద మరమ్మతులు, పారిశుద్ధ్య నిర్వహణ పనులు పూర్తి చేయాలన్నారు. సైదాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బోనాలు, ఘటాల ఊరేగింపు కార్యక్రమాలు పూర్తయ్యే వరకు జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలని కోరారు. కార్పొరేటర్ వెంట జీహెచ్‌ఎంసీ డీఈఈ బన్సీలాల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, ఓబీసీ మోర్చా కన్వీనర్ రాజేష్, శ్రీనివాసాచారి ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

చాదర్‌ఘాట్: ప్రతీ సంవత్సరం లాగే ఈసారి కూడా బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఉత్సవాల కమిటీ చైర్మన్ చౌకి రవికుమార్ తెలిపారు. బుధవారం ఓల్డ్‌మలక్‌పేటలోని పోచమ్మ దేవాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కమిటీ ప్రతినిధులతో కలిసి బోనాల ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. బాబు శ్రీనివాస్, శంకర్ ముదిరాజ్, సురేష్‌కుమార్, టిన్నూసింగ్, వాసు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు టమాట రూ. 47, వంకాయ రూ. 28, బెండ రూ. 35, పచ్చిమిర్చి రూ. 55, కాకర రూ. 35, బీర రూ. 35, క్యాబేజీ రూ. 20, ఫ్రెంచి బీన్స్ రూ. 70, క్యారెట్ రూ. 45, దొండ రూ. 28, చిక్కుడు రూ. 70, గోకర రూ. 35, బీట్‌రూట్ రూ. 35, క్యాప్సికమ్ రూ. 50, ఆలు రూ. 40, దోస రూ. 18, సొర రూ. 11, పొట్ల రూ. 13, ఉల్లిగడ్డ రూ. 39, చామగడ్డ రూ. 37. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

నాగోలు: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రస్తుత కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు రాయబండి పాండురంగ చారి ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రజలు 17 మంది పార్లమెంట్ సభ్యుల్లో 8 మందిని బీజేపీ సభ్యులుగా పంపించినా మోదీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించడంలో పరిగణలోకి తీసుకోలేదన్నారు. భవిష్యత్‌లో ఎన్డీఏ కూటమిని రాష్ట్ర ప్రజలు ఓడిస్తేనే కేంద్ర బడ్జెట్‌లో స్థానం లభిస్తుందని అన్నారు.

రాష్ట్రంపై నిర్లక్ష్యం..

నాగోలు: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని టీపీసీసీ రాష్ట్ర ఆదివాసీ గిరిజన వైస్ చైర్మన్ గాంధీ నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణపై కేంద్రానికి ఉన్న నిర్లక్ష్యాన్ని మోదీ ప్రభుత్వం స్పష్టం చేసిందని, తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్రంలో సహాయక మంత్రులుగా ఉన్నా రాష్ట్రానికి నిధులు తేవడంలో విఫలమయ్యారన్నారు.

సూపర్‌వైజర్ల బదిలీలు

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు రెడ్డినాయక్, ఫరహత్ సుల్తానా గుడిమల్కాపూర్‌కు బదిలీ కాగా, వారి స్థానంలో దేవేందర్, పవన్ గుడిమల్కాపూర్ నుంచి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా మార్కెట్ ఎస్‌జీఎస్ దామోదర్ మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో ఉండి సమస్యలను గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

కదిరి కృష్ణపై వీహెచ్‌పీ నేతల ఫిర్యాదు

చైతన్యపురి: వేంకటేశ్వరస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కదిరి కృష్ణపై చర్యలు తీసుకోవాలని గడ్డిఅన్నారం వీహెచ్‌పీ నాయకులు బుధవారం సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వేంకటేశ్వర సుప్రభాతంలోని శ్లోకాల అర్థం మార్చి చేసిన వ్యాఖ్యలు హిందూ సమాజాన్ని కించపరిచేలా ఉన్నాయని వెంటనే అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో మధుసూదన్‌రెడ్డి, అనంతాచారి, బాలరాజు, మధుసూదన్ ఉన్నారు.

రహదారులపై చెత్త వేయొద్దు



చైతన్యపురి: రహదారులపై ఉన్న చెత్త, మట్టికుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మార్నింగ్‌వాక్ కార్యక్రమంలో కార్పొరేటర్ బుధవారం ఆయన జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బందితో పలు కాలనీలలో పర్యటించారు. వర్షం పడితే రోడ్లపై ఉన్న చెత్తతో దోమలు వ్యాప్తి చెంది అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. రోడ్లపై చెత్త వేసే వారిని గుర్తించి జరిమానా విధించాలన్నారు. ఖాళీ స్థలాల్లో చెత్త వేయొద్దని ఇళ్ల వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలన్నారు. కార్పొరేటర్ వెంట శానిటేషన్ సూపర్‌వైజర్ బుచ్చయ్య, జవాన్ యాదగిరి ఎస్‌ఎఫ్‌ఏ పాండు, శ్రీనివాసరెడ్డి, కాలనీవాసులు తిలక్, శ్రీనివాస్ ఉన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించండి

ఏరియా ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్



వైద్యబృందంతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శశాంక్

వనస్థలిపురం: వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తామని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ అన్నారు. బుధవారం జిల్లా వైద్యాధికారులతో కలిసి ఆయన వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిని సందర్శించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అన్ని వార్డులను పరిశీలించిన ఆయన ఇంకేమైనా వసతులు కావాలా అని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు తెలిపిన ప్రకారం ఆసుపత్రిలో తాగునీరు, లిఫ్ట్, పార్కింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఏరియా ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేసి మెడికల్ కళాశాలకు అటాచ్ చేస్తున్నందున ఇక్కడకు రాబోయే ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు కావాల్సిన వసతులపై వైద్యబృందంతో చర్చించారు. త్వరితగతిన ఆసుపత్రిలో అన్ని సమస్యలను పరిష్కరించి ఆసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు, ఆసుపత్రి ఆర్‌ఎంఓ జయమాల, వైద్యులు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇతరులను రంగారెడ్డి జిల్లాకు బదిలీ చేయొద్దు



సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొన్న పీఆర్‌టీయూ నాయకులు

వనస్థలిపురం: ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా ఇతర జిల్లాలలోని వారిని రంగారెడ్డి జిల్లాలోకి బదిలీ చేయరాదని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్ యాదవ్ అన్నారు. పీఆర్‌టీయూటీఎస్ రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు వారోత్సవాల్లో భాగంగా బుధవారం జెడ్‌పీహెచ్‌ఎస్ వనస్థలిపురం, హయత్‌నగర్ పాఠశాలల్లో చేపట్టిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. సమస్యల సాధనకు పీఆర్‌టీయూటీఎస్ నిరంతరం పోరాడుతుందన్నారు. ఉమ్మడి ఏకీకృత సర్వీసు రూల్స్‌ను సాధించి ఉపాధ్యాయులు, ఎంఈఓ, జేఎల్, డైట్ లెక్చరర్ ప్రమోషన్లను ఇప్పిస్తామని, పెండింగ్‌లో ఉన్న 5 డీఏలు, 50 శాతం ఫిట్‌మెంట్ ఇప్పిస్తూ పీఆర్‌సీ ఏర్పాటు చేయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు రాధాకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి దీన్‌దయాళ్‌రెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురారి పాల్గొన్నారు.

కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు

నీటి నాణ్యత, క్లోరిన్ శాతంపై తనిఖీలు



క్లోరిన్ శాతాన్ని పరిశీలిస్తున్న డీజీఎం అభిలాష్

చాదర్‌ఘాట్: కలుషిత నీరు సరఫరాలు కాకుండా మలక్‌పేట అధికారులు దృష్టి సారిస్తున్నారు. ర్యాండమ్‌గా బస్తీలను ఎంపిక చేసుకొని పలు ఇళ్లలో నీటి నాణ్యతను పరిశీలిస్తున్నారు. మూసారాంబాగ్, ఓల్డ్ మలక్‌పేట, సైదాబాద్,అక్బర్‌బాగ్ డివిజన్లలో దాదాపు 35 వరకు మురికివాడలు ఉండగా ఈ ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా నీటి సరఫరాతో పాటు నీటి నాణ్యతా పరీక్షలను నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో కలుషిత నీరు సరఫరా కాకుండా చూడటంతో పాటు నీటి నాణ్యత ప్రమాణాలు పడిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రోజూ వచ్చే తాగునీటిలో క్లోరిన్ శాతం 0.2 నుంచి 0.5 పీపీఎంగా ఉండాలి. ఒక వేళ క్లోరిన్ శాతం తక్కువగా ఉంటే అందుకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ఆయా ప్రాంతాలలో పైప్‌లైన్లు, నల్లాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా డీజీఎం ఎస్.అభిలాష్ వర్షాకాలం నల్లానీరు కొద్దిగా రంగుమారి వస్తుందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. ఫిల్టర్ చేసిన తర్వాత కూడా కొంత వరకు రంగు నీళ్లు వస్తుంటాయి. ప్రతిరోజు లోతట్టు ప్రాంతాలలో పర్యటిస్తూ నీటి నాణ్యత పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. వర్షాకాలంలో నీటిని కాచి వడబోసి తాగాలన్నారు.

ఘనంగా కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు



కేటీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, స్వీట్లు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

మన్సూరాబాద్: మాజీ మంత్రి కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు ఎల్‌బీనగర్‌లోని పలు ప్రాంతాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి పాల్గొని మన్సూరాబాద్ చౌరస్తా సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. జగదీష్‌యాదవ్, రఘువీర్ రెడ్డి, రుద్రయాదగిరి, రాకేష్‌రెడ్డి, జగదీష్‌గౌడ్, చంద్రమోహన్, భాస్కర్‌యాదవ్ పాల్గొన్నారు.

- చంపాపేట బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్ చౌరస్తాలో కేక్‌కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మధుసూధన్‌రెడ్డి, కృష్ణమాచారి, రవిముదిరాజ్, ఉమామహేశ్వర్, యాదయ్య, ప్రభాకర్, అంజిరెడ్డి, శివగౌడ్, జగదీష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆర్‌కేపురంలో..

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ ఆధ్వర్యంలో కేటీఆర్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం అరవింద్ శర్మ, శ్రీనివాస్, సాజీద్, కొండ్ర శ్రీనివాస్, జై శ్రీమన్నారాయణ, శ్యాం గుప్తా, పెంబర్తి శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, ముచింతల జగన్, శ్రీరాములు, యాదగిరి, దీపక్, వెంకటేష్ గౌడ్, మురళీదార్ రెడ్డి పాల్గొన్నారు.

వనస్థలిపురం: మాజీమంత్రి కేటీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని బుధవారం వనస్థలిపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అజయ్‌యాదవ్, గణేష్ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

అంధ బాలిక పట్ల అసభ్య ప్రవర్తన

ఆలస్యంగా వెలుగులోకి..

మలక్‌పేట: అంధ బాలిక పట్ల వాష్‌రూమ్స్ క్లీనర్ (స్కావెంజర్) అసభ్యంగా ప్రవర్తించిన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబ సభ్యులు, అధికారుల వివరాల ప్రకారం.. మలక్‌పేట టీ–బ్లాక్‌లోని ప్రభుత్వ అంధ బాలికల వసతి గృహంలో మూడో తరగతి చదువుతున్న బాలిక (8) పట్ల స్కావెంజర్‌గా పనిచేస్తున్న ఓ యువకుడు కొన్ని రోజుల క్రితం అసభ్యంగా ప్రవర్తించాడు. తల్లి వచ్చి బాలికను సొంత గ్రామానికి తీసుకెళ్లింది. అతని ప్రవర్తనపై అనుమానం వ్యక్తపరుస్తూ ఈ నెల 16న మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత బాలికను వసతిగృహం నిర్వాహకులు భరోసా సెంటర్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. మళ్లీ మరో ముగ్గురు బాలికలను భరోసా సెంటర్‌కు తీసుకెళ్లారు. తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా పిల్లలను భరోసా సెంటర్‌కు ఎందుకు తీసుకెళ్లారని వారి కుటుంబ సభ్యులు బుధవారం వసతిగృహానికి వచ్చి అధికారులను నిలదీయగా అసలు విషయం బయటకు వచ్చింది. విషయం తెలుసుకున్న సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, బీజేపీ నేతలు వసతిగృహానికి వచ్చి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై పోలీసుల విచారణ జరుగుతుందని, కఠిన చర్యలు తీసుకుంటామని సంబంధిత శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేందర్ తెలిపారు. అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. సంబంధిత అధికారులు, పోలీసులు విషయం బయటికి రాకుండా గోప్యంగా ఉంచారు. పూర్తి వివరాలు వెల్లడించడానికి పోలీసులు నిరాకరించారు.